కంటోన్మెంట్ ఎమ్మెల్యేకు వినతి



అడ్డగుట్ట: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను బ్రాహ్మణ సేవా వాహిని బృందం మంగళవారం తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో కలిశారు. బ్రాహ్మణ పరిషత్ పథకాల అమలు, కంటోన్మెంట్ పరిధిలో బ్రాహ్మణ భవనం నిర్మించాలని వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షులు రఘు కిరణాచార్యులు, వెంకటేశ్వర శర్మ, సీతారామ శాస్త్రి, రాకేష్ కుమార్, వెంకటేశ్వరరావు, సుధాకరరావు, పవన్ కుమార్, శేషం శ్రీకర్, శ్రీనివాస శర్మ పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

అడ్డగుట్ట: తుకారాంగేట్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శంకర్ నాయక్‌ను మంగళవారం కాంగ్రెస్ డివిజన్ మాజీ అధ్యక్షుడు గంట రాజుసాగర్ నేతృత్వంలో పలువురు కలిశారు. రాత్రి సమయంలో అల్లరిమూకలు సంచరిస్తున్నారని, పెట్రోలింగ్ పెంచాలని కోరారు. ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన వారిలో కొమరమ్మ, అంజయ్య, కృష్ణ, కృష్ణారావు, భారతి హరి, ప్రభాకర్, నాయక్, లక్ష్మీ, సులోచన, రామ్‌లీల, రాజు, రవి పాల్గొన్నారు.

బాక్సర్‌కు కేంద్రమంత్రి అభినందనలు



అంటోనీని అభినందిస్తున్న కిషన్‌రెడ్డి

బన్సీలాల్‌పేట్: బాక్సర్ ఆంటోనీ కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అభినందించారు. ఇటీవల హర్యానాలో జరిగిన జాతీయ బాక్సింగ్ చాంపియన్ జూనియర్స్ అండర్–18లో ఆంటోనీ గోల్డ్‌మెడల్ సాధించాడు. మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అంటోనీని అభినందించి మాట్లాడారు. ఆంటోనీ జాతీయ స్థాయిలో రాణించడం హర్షణీయమన్నారు.కృషి, పట్టుదల, ఆత్మ విశ్వాసం, దృఢ సంకల్పం ఉంటే ఏ రంగంలోనైనా రాణించగలమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంటోనీ తండ్రి ఆటో డ్రైవర్ విజయ్‌కుమార్ రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీసీ సుభాష్‌రావు

సికిందాబాద్: మెట్టుగూడ డివిజన్ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులకు మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులు డెంగీ నివారణ అంశాలపై అవగాహన కల్పించారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు, మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత నేతృత్వంలో డెంగీ జ్వరాలు ప్రబలే తీరు, నివారణ చర్యల గురించి వివరించారు. డివిజన్ పరిధిలోని మెట్టుగూడ, విజయపురికాలనీల్లోని పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ రజనీకింత్, ఎంటమాలజీ పర్యవేక్షకురాలు సునిత, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌ల అందజేత



చిలకలగూడ : మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సికింద్రాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త బొడ్డు యాదగిరి విద్యార్థులకు టై, బెల్ట్‌ను అందించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జునరెడ్డి అభ్యర్థన మేరకు పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు తమవంతు సాయం అందించినట్లు యాదగిరి తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లీశ్వరీ, హసినాబేగం, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ బాటిళ్ల అందజేత



వాటర్‌బ్యాటిళ్లు అందిస్తున్న జగదీశ్వర్ గుప్తా

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న పాలనాధికారులకు వైఎస్‌ఆర్‌సీపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తడక జగదీశ్వరగుప్తా మంగళవారం వాటర్ బాటిళ్లను అందజేశారు. నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్న రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్లు (ఆర్ఎంఓ) క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ (సీఎంఓ)లకు జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వాటర్ బాటిళ్లు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్–1 జయకృష్ణ, వైఎస్ఆర్‌సీపీ ప్రతినిధులు విజయ్‌కుమార్ ఎలిజబెత్ రాణి, బెట్టినలంకా పాల్గొన్నారు.

19, 20న 'వాణిజ్య-24' పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎంకాం విద్యార్థులకు ఈ నెల 19, 20 తేదీలలో వాణిజ్య–2024 కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మంగళవారం ఓయూ పాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ వాణిజ్య–2024 వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంకాం విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు అంతర్ విశ్వవిద్యాలయాల స్థాయిలో వివిధ రకాల వాణిజ్య పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

లష్కర్ బోనాలకు చురుగ్గా పనులు

- కొనసాగుతున్న చెట్లకొమ్మల నరికివేత
- రహదారులు, డ్రైనేజీ లైన్ల మరమ్మతులు



కట్టమైసమ్మ దేవాలయం ముందు పెరిగిన చెట్టు కొమ్మలు తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లో బోనాల జాతర కోసం అభివద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల మొదటివారం నుంచి సికింద్రాబాద్ నియోజకవర్గంలో బోనాల జాతర ఉత్సవాలు జరుగనున్నాయి. సికింద్రాబాద్ మహంకాళి జాతర ఉత్సవాలు నిర్వహించిన తర్వాతి వారం సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో బోనాల జాతర వేడుకలు మూడు దఫాల్లో జరుగనున్నాయి. నియోజకవర్గంలోని 200కు పైగా ఆలయాల్లో జరుగనున్న బోనాల జాతర వేడుకల కోసం జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు అభివద్ధి పనులు ప్రారంభించారు.

అభివృద్ధి పనులు...

ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్న ఆలయాల జాబితాను ఇప్పటికే సిద్ధం చేసుకున్న జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు ఆయా ప్రాంతాల్లో పలు అభివద్ధి పనులను ప్రారంభించారు. ఆలయాలు ఉన్న ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీల సమస్యలకు పరిష్కార మార్గం చూపడంతో పాటు, వరదనీరు సాఫీగా పారేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆలయాలకు తాగునీటి సదుపాయం, విద్యుత్‌దీపాల ఏర్పాటు తదితర అభివద్ధి పనుల కోసం సిద్ధం చేసుకున్న కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఆలయాల చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం కోసం భారీ వృక్షాల చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారు.

ఆలయాల ముస్తాబు..

బోనాల జాతర సమీపిస్తున్న నేపథ్యంలో పలు అమ్మవారి ఆలయాల సుందరీకరణ పనులు ప్రారంభమయ్యాయి. చిలకలగూడ కట్టమైసమ్మ దేవాలయ సుందరీకరణ కోసం సికింద్రాబాద్ ఎమ్మెల్యే రూ.7 లక్షల విరాళాన్ని అందించారు. ఈ దేవాలయంలో ఆలయానికి రంగులు అద్దే కార్యక్రమం ప్రారంభమైంది. మిగతా డివిజన్ల పరిధిలోని దేవాలయాల్లో ఫ్లోరింగ్, కాంపౌండ్ వాల్ తదితర పనులు ప్రారంభమయ్యాయి. మరికొన్ని దేవాలయాల్లో భక్తుల సౌలభ్యం కోసం పలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలు ఘనంగా జరిగే చిలకలగూడ కట్టమైసమ్మ దేవాలయం, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, లాలాపేట అమ్మవారి దేవాలయాల వద్ద భక్తులకు క్యూలైన్ల ఏర్పాటు ఇతరత్రా వసతులకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు.

నిధులకు దరఖాస్తులు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయినప్పటి నుంచి నగరంలో బోనాల జాతరను అధికారిక పండుగగా ప్రభుత్వం గుర్తించింది. ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం కోసం ప్రభుత్వ పరంగా ఏటా దేవాలయాలకు నిధులు కేటాయిస్తున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని 150 అమ్మవారి దేవాలయాల నిర్వాహకులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ మారు బోనాల జాతర నిర్వహణ కోసం ఇక్కడి అన్ని ఆలయాలకు కలిపి రూ.1 కోటి నిధులు ప్రభుత్వం నుంచి విడుదల కానున్నాయి.

భక్తుల ఇబ్బందులు తొలగిస్తాం.



భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండేవిధంగా బోనాల జాతర అభివద్ధి పనులు చేపడుతున్నాం. ముఖ్యంగా బోనాలతో వచ్చే మహిళలకు ఇబ్బందులు లేకుండా రహదారుల మరమ్మతు, ఫుట్‌పాత్‌ల ఆధునీకరణ వంటి అభివద్ధి పనులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాం. ఐదు డివిజన్లలో ఇంజినీరింగ్ విభాగం అధికారులను పర్యవేక్షకులుగా నియమించి అభివద్ధి పనులు పూర్తి చేస్తున్నాం.

–సుభాష్‌రావు, జీహెచ్‌ఎంసీ డీసీ

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..



బోనాల జాతర జరిగే ఆలయాల వద్ద తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. జాతర జరిగే ప్రాంతాల్లో ఉత్సవాల రోజుల్లో నిత్యం తాగునీరు సరఫరా చేయాలని నిర్ణయించాం. రహదారులపై మురుగునీరు, వరదనీరు నిల్వలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. సికింద్రాబాద్ ప్రాంతంలోని బోనాలు నిర్వహించే ఆలయాల వద్ద సమస్యలు ఉన్నట్టయితే మా దష్టికి తెస్తే పరిష్కరిస్తాం.

–వై.కృష్ణ, డీజీఎం జలమండలి

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళలతో ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: రాష్ట్రంలో పేద మహిళల సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మంగళవారం నియోజకవర్గం తిరుమలగిరి ఓల్డ్ గాంధీనగర్‌లో హైదరాబాద్ ఆర్చ్ డైయోసెస్ సోషల్ సర్వీస్ సొసైటీ చైర్మన్ కార్డినల్ పూల ఆంథోని ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని శ్రీగణేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీగణేష్ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో పలు కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా శిక్షణ అందజేసి మిషన్లు పంపిణీ చేశామని చెప్పారు. మహిళలకు వృత్తి నైపుణ్యం అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన అధ్యక్షులు శ్యాంసన్, ప్రదీప్, రంజిత్, సరిత, భవాని, అంటోనీ, జోసెఫ్, సన్నీ, ప్రభు పాల్గొన్నారు.

నియామకం



సనత్‌నగర్: బేగంపేట కేసరి హనుమాన్ దేవాలయం చైర్మన్‌గా డీవీ మహేందర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు నరేష్, పద్మారెడ్డి, సత్యనారాయణ, దీప్‌కుమార్, నవీన్, మహేందర్‌కు అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి



మొక్క నాటుతున్న గాంధీ సూపరింటెండెంట్ రాజారావు

గాంధీఆస్పత్రి: మొక్కలు నాటి, పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు అన్నారు. మంగళవారం ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహించిన వన మహోత్సవంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ.. ఆహ్లాదరకమైన వాతావరణం భవిష్యత్ తరాలకు అందించాలంటే మొక్కలు పెంచాలన్నారు. గత కొన్నేళ్లుగా తన పుట్టినరోజున మొక్కలు నాటడం ఆనవాయితీగా వస్తుందన్నారు. జీడీఎక్స్ ప్రతినిధి రవికుమార్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శివాజీ, ఆస్పత్రి గార్డెనింగ్ ప్రతినిధి యోహాన్ పాల్గొన్నారు.

- సూపరింటెండెంట్ పేషీలో జరిగిన కార్యక్రమంలో పలు విభాగాలకు చెందిన హెచ్ఓడీలు, వైద్యులు, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు, ఆర్ఎంఓలు, సీఎంఓలు, మినిస్టీరియల్ స్టాఫ్, ఆస్పత్రి పాలన అధికారులు, సిబ్బంది గాంధీ సూపరింటెండెంట్ రాజారావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాల పునర్విభజనపై ప్రభుత్వం సానుకూలంగా ఉంది



రోహిణ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సికింద్రాబాద్: జిల్లా పునర్విభజన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఖైరతాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి చెప్పారు. సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసే అంశానికి సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. మంగళవారం లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్‌కుమార్‌తో పాటు సమితి ప్రతినిధులు రోహిణ్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రోహిణ్‌రెడ్డి మాట్లాడుతూ.. కొత్త జిల్లాల ఏర్పాటు, పునర్విభజనకు సంబంధించి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసే దిశగా సీఎం చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఖైరతాబాద్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణగౌడ్, సాధనకమిటీ సభ్యులు బాల్‌రాజ్‌యాదవ్, జగదీశ్‌గౌడ్, శైలేందర్, సునిల్‌ముదిరాజ్, కృష్ణ, అశోక్‌చారి పాల్గొన్నారు.

దర్భంగా ఎక్స్‌ప్రెస్‌లో మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లు చూపిస్తున్న పోలీసులు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న దర్భంగా ఎక్స్‌ప్రెస్‌లో బోగీలో 91 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బీఎస్ సరస్వత్ వివరాల ప్రకారం.. సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న దర్భంగా ఎక్స్‌ప్రెస్ రైలులో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. బీ–1 బోగీలో గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లిన బ్యాగులను తనిఖీ చేయగా వివిధ బ్రాండ్‌లకు చెందిన 91 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

రాయ్‌పూర్ ఐఐఎంతో ఇఫ్లూ ఒప్పందం

ఉస్మానియా యూనివర్సిటీ: ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) రాయ్‌పూర్‌తో ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజస్ సెంట్రల్ యూనివర్సిటీ(ఇఫ్లూ) ఒప్పందం చేసుకున్నాయి. మంగళవారం ఇఫ్లూలో జరిగిన కార్యక్రమంలో చైనా, అరబిక్, ఫ్రెంచ్, స్పానిష్ భాషల ట్రాన్స్‌లేషన్ కోసం ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం డైరెక్టర్ ప్రొ.రామ్‌కుమార్ కాకనీ, ఇఫ్లూ ఇన్‌చార్జి వీసీ ప్రొ.సురభి భారతీ, రిజిస్ట్రార్ ప్రొ.నరసింహరావు పాల్గొన్నారు.

ఎస్సై ఆత్మహత్య ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలి

లాలాపేట: దళిత ఎస్సై ఆత్మహత్య ఘటనపై సీబీఐతో విచారణ జరిపించాలని దళిత జన సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బొజ్జ యాదగిరి డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన దళిత జన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండె సంపత్, కార్యదర్శి గంగాధర్‌తో కలిసి మాట్లాడారు. శాంతిభద్రతలను పరిరక్షించే పోలీసు శాఖలోనే కుల వివక్ష చూపడం దుర్మార్గమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నామని చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు ఈ ఘటనపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

వినోభానగర్‌లో పాముల బెడద

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ లాలాపేట వినోభానగర్ వాసులు గత కొన్ని రోజుల నుంచి పాముల బెడదతో ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో బయటకు రావాలంటే జంకుతున్నారు. నిరుపయోగంగా మారిన రామ్ థియేటర్ శిథిల భవనం నుంచి గతంలో పలుమార్లు జనవాసాల్లోకి పాములు వచ్చిన ఘటనలు ఉన్నాయి. తాజాగా వినోభానగర్‌లోని పోచమ్మ దేవాలయం సమీపంలో గత రెండు వారాల నుంచి పాములు వచ్చిచ్చి భయాందోళనకు గురి చేస్తున్నాయి. మంగళవారం బస్తీ వాసులు ఓ పామును పట్టుకుని డబ్బాలో బంధించారు.

రైలు ఢీకొని మహిళ మృతి

సికింద్రాబాద్: రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. సికింద్రాబాద్ రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 45 సంవత్సరాల వయసున్న ఓ మహిళ బొల్లారం రైల్వేస్టేషన్ 1వ నెంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి 2వ ప్లాట్‌ఫామ్‌కు వెళ్లేందుకు పట్టాలు దాటే ప్రయత్నం చేస్తుండగా అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన రైలు మహిళను ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వివరాలు సేకరించగా మృతురాలి వివరాలు లభించలేదు. ఒంటిపై ఎరుపు, పసుపు రంగులు కలిగిన చీర ధరించి ఉందని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు.

యువకుడిపై మూకుమ్మడి దాడి

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవ వేడుకలకు వచ్చిన ఓ యువకుడిపై కొందరు దాడికి తెగబడ్డాడు. రహమత్‌నగర్‌కు చెందిన కృష్ణ (18) స్నేహితులతో కలిసి బల్కంపేటకు వచ్చాడు. ఆర్ అండ్ బీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం వద్ద నిలబడి ఉండగా వేరే వ్యక్తులు గొడవ పడుతుండటాన్ని గమనించి అక్కడికి వెళ్లాడు. దీంతో ఆగ్రహించిన సదరు యువకులు కృష్ణపై కత్తిలాంటి పదునైన ఆయుధంతో దాడి చేశారు. పోలీసులు వారిని పట్టుకునే లోపు పారిపోయారు. గాయాలకు గురైన బాధితుడిని చికిత్స నిమిత్తం అమీర్‌పేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారి మధ్య పాత కక్షలు ఏవైనా ఉన్నాయా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.43, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 35, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 45, పందిరి బీర 38, క్యాబేజీ 33, క్యారెట్ 35, దొండ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 85, గోకరకాయ 45, కీర 25, దోసకాయ 23, బీట్‌రూట్ 23.

కల్యాణ మహోత్సవాలు.. సేవా కార్యక్రమాలు



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. మహిళలు, శివసత్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది వచ్చే ఆషాఢమాసం ఆరంభంలో కల్యాణాన్ని జరిపిస్తే వర్షాలు సమృద్ధిగా కురిసి పండుతాయని భక్తుల నమ్మకం. పూర్వం కల్యాణం ఒగ్గు కళాకారులతో జరిపించేవారు.అదే ఆనవాయితీ నేటికి కొనసాగుతూ వస్తోంది. మొదటగా ఒగ్గు కళాకారులు ఆలయ ఆవరణలో అమ్మవారి కల్యాణం జరిపించాక, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహిండం ఆనవాయితీగా వస్తుందని ఆలయ అధికారులు తెలిపారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు..

లక్షలాదిగా వచ్చిన భక్తులకు అడుగడుగునా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జలమండలి శాఖ అధికారులు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అక్కడికి వచ్చిన భక్తులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన తన నివాసం వద్ద అన్నదానం చేపట్టారు. ప్రైవేటు ఉద్యోగుల సంఘం నాయకులు కూతురు నర్సింహ ఆధ్వర్యంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాయల సేవా సమితి ఆధ్వర్యంలో విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది, వలంటీర్లకు పండ్లు, మజ్జిగ అందజేశారు.



ఇంటి వద్ద అన్నదానం చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రసూన



సిబ్బందికి పండ్లు, మజ్జిగ పంపిణీ చేసిన రాయల సేవా సమితి సభ్యులు

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న నరసింహ కన్నన్



ఈద్గా అంబేద్కర్‌నగర్‌లో కల్యాణంలో పాల్గొన్న జంపన ప్రతాప్

రసూల్‌పురా: భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని పీసీసీ సెక్రటరీ డా. నరసింహన్ కన్నన్ అన్నారు. 8వ వార్డు బొల్లారంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం జరిగిన అమ్మవారి కల్యాణంలో నరసింహన్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆషాఢమాసం మొదటి మంగళవారం రేణుకా ఎల్లమ్మ కల్యాణం ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించడం అనవాయితీ అన్నారు. ఈ కార్యక్రమంలో బాల్‌రాజు, పూర్ణచందర్, చిన్న, సతీష్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

ఈద్గా అంబేద్కర్‌నగర్‌లో..

అంబేద్కర్ నగర్‌లో ప్రసిద్ధిగాంచిన రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి కల్యాణం వైభవంగా జరిగింది. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బల్కంపేట రేణుకా ఎల్లమ్మ కల్యాణం నిర్వహించే రోజే నగర వ్యాప్తంగా ఎల్లమ్మ ఆలయాలలో కల్యాణం జరపడం సాంప్రదాయమన్నారు.ఈ కార్యక్రమంలో దాల్‌రాజు, రాములు, శంకర్, కృష్ణ, రమేష్, వీరేష్, సారమ్మ, యాదమ్మ, ప్రశాంత్, సంతోష్ పాల్గొన్నారు.

సందడిగా వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో వన మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని అందించారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే విరివిగా మొక్కలు నాటాలంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యామ్‌సుందర్‌గౌడ్ చిన్నారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాధిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓయూలో జాతీయ విద్యార్థి దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 76వ జాతీయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ అధ్యక్షులు ప్రొ.మీసాల ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఎగురవేసి మాట్లాడారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ సెమినార్ హాలులో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా డా.మట్ట రాఘవేంద్ర, శ్రీహరి, కమల్ సురేష్, అలివేలి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సాగబోయిన పాపారావు ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్‌కట్ చేసి మాట్లాడారు.

- ఓయూ జేఏసీ చైర్మన్ ఓరుగంటి కృష్ణ, కొర్వి బాలకృష్ణ తదితరులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రొ.గాలివినోద్ కుమార్, వాలువాయి ఉషాకిరణ్, గాదె వెంకట్, నరసింహ, అరుణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు